
సాక్షి ఒడిశా

సోమవారం । 1 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,68,768
బంగారం	3 గ్రాముల 580 మిల్లీ గ్రాములు
వెండి	4 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



పట్టాలెక్కిన వందేభారత్

వందేభారత్ రైలు పట్టాలెక్కింది. మాల్దా టౌన్ నుంచి బెంగళూరుకు రైలు సేవలు ఆదివారం ప్రారంభమయ్యాయి.

- IIలో



భారీగా గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి, బరంపురం జిల్లాలో భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

- IIలో

న్యూస్‌రీల్

తుది దశకు ప్లానిటోరియం పనులు



తుది మెరుగులు దిద్దుకుంటున్న ప్లానిటోరియం

రాయగడ: విద్యార్థులకు ఖగోళ విజ్ఞానాన్ని అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో బాకురుగుడ వద్ద సుమారు రూ.14 కోట్లతో ప్లానిటోరియం పనులు చేపట్టారు. పనులు తుది దశకు చేరుకోవడంతో త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పనులను పరిశీలించేందుకు రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి అశోక్‌చంద్ర పండా శనివారం వచ్చారు. చౌయితి ఉత్సవాల ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు వచ్చిన పండ ముందుగా ప్లానిటోరియాన్ని సందర్శించారు. పనుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

మహిళలకు స్కూటీలు పంపిణీ



స్కూటీలు అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి పరిధిలో ఆదివారం మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా నలుగురు మహిళలకు స్కూటీలు పంపిణీ చేశారు. ఇంకా అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే స్కూటీలు మంజూరు చేస్తామని చిత్రకొండ సమితి అధ్యక్షురాలు రాజేశ్వరీ ఖీలో తెలిపారు. కార్యక్రమంలో చిత్రకొండ స్టేట్‌బ్యాంక్ మేనేజర్ అరుణ్‌కుమార్ సున్నాధర్, ఒడిశా లైవ్లీహుడ్ అధ్యక్షుడు పరశురామ్ బెహరా, మిషన్‌శక్తి అధికారి రవీంద్ర భూయ్యా, సోమనాథ్ కుంభార్, శిశువు అభివృద్ధి అధికారి స్వర్ణప్రభదాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీధర ఆచార్య

పర్లాకిమిడి: స్థానిక డోలాట్యాంకు రోడ్డులో నవజీవన్ అంధ, అనాథాశ్రమంలో 2024 ఆంగ్ల సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ శ్రీధర ఆచార్య ముందుగా అనాథ బాలబాలికలతో కేక్ కట్ చేయించారు. అనంతరం 72 మంది వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి ఎస్.వి.రమణ, హౌస్ మదర్ ప్రభాసినీ లిమ్మా తదితరులు పాల్గొన్నారు.

సిటీ బస్సు దగ్ధం



కాలుతున్న బస్సు

జయపురం: ప్రజా రవాణాకు ఉద్దేశించిన సిటీ బస్సులు తగలబడిపోతున్నాయి. గత నవంబర్ రెండు సిటీ బస్సులు అగ్నికి ఆహుతైన విషయం మరువక ముందే తిరిగి శనివారం సాయంత్రం సిటీ టెర్మినల్ ప్రాంతంలో మరో సిటీ బస్సు దగ్ధమైంది. సమాచారం అందుకున్న వెంటనే జయపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి మిగతా బస్సులను రక్షించారు.

- ఒడిశా సివిల్స్ పరీక్ష వయో పరిమితి పెంపు
- 200 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు నిర్ణయం
- మంత్రి మండలి నిర్ణయం

13 ప్రతిపాదనలకు.. ఆమోదం



మంత్రి మండలి తీర్మానాలు వివరిస్తున్న మంత్రి ప్రదీప్‌కుమార్ ఆమత్, చీఫ్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ జెనా

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన లోక్‌సేవా భవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 13 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ వివరాలను రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి ప్రదీప్‌కుమార్ ఆమత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా మీడియాకు వెల్లడించారు. ఒడిశా సివిల్ సర్వీస్ పరీక్షల వయోపరిమితి గతంలో 32 ఏళ్లుగా ఉండేది. తాజాగా మరో 6 సంవత్సరాలకు పొడిగించారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు 38 సంవత్సరాల వయస్సు వరకు సివిల్ సర్వీస్ పరీక్షల్లో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ చర్యతో ఒడిశా సివిల్ సర్వీసు (ఓసీఎస్) పరీక్షలు రాసే ఔత్సాహిక అభ్యర్థులకు మేలు కలగనుందని చీఫ్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ జెనా తెలిపారు. కేబినెట్ నిర్ణయం మేరకు కొత్త వయో పరిమితి నిబంధన 2024 నుంచి అమలవుతుందన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధి శాఖలో 365 మంది జూనియర్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి మంత్రి మండలి అంగీకరించింది.
- భారత ప్రజారోగ్య ఫౌండేషన్‌కు 5 ఎకరాల స్థలం కేటాయించారు.
- పట్టణ, నగర ప్రాంతాల్లో రాకపోకల రంగంలో 200 ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇవి భువనేశ్వర్‌తో సహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు సేవలందిస్తాయి.
- పట్టణ ప్రాంతాల్లో ఎల్‌ఈడీ లైట్ల కోసం రూ.112 కోట్ల 18 లక్షలను కేబినెట్ మంజూరు చేసింది.
- శ్రీ జగన్నాథ సంస్కృతి ప్రచారానికి గ్రామీణ ప్రాంత ప్రజలను భాగస్వామ్యం చేయాలని మంత్రి మండలి తీర్మానించింది. జనవరి 5 నుంచి శ్రీమందిర వారసత్వ ప్రాకార ప్రాజెక్టు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 314 మండలాల్లో అన్ని పంచాయతీల ప్రజల నుంచి వక్క, బియ్యం సేకరించేందుకు జగన్నాథ రథం ఇంటింటికీ తిరుగుతుంది. ప్రతి పంచాయతి నుంచి సేకరించిన పవిత్ర సామగ్రిని మండలంలో ఒక ఆలయంలో భద్రపరుస్తారు. ప్రతి పంచాయతీ నుంచి ప్రజలు పూరీకి వచ్చి ప్రాకార ప్రాజెక్టు లోకార్పణ మహోత్సవంలో ప్రత్యక్షంగా పాలు పంచుకుంటారు. ఈ కార్యక్రమం ప్రతి పంచాయతీలో ఎల్‌ఈడీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని మంత్రి మండలి ప్రకటించింది. ఇందుకు రూ. 156 కోట్లు వెచ్చించేందుకు అనుమతి లభించింది.
- అమొ ఒడిషా నవీన్ ఒడిశాలో భాగంగా శ్రీ మందిర్ ప్రాకార ప్రాజెక్ట్ లోకార్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఆమోదించబడిన బడ్జెట్ పరిమితిని రూ.4000 కోట్ల నుంచి రూ. 4,214 కోట్లకు పెంచినట్లు మంత్రి మండలి ప్రకటించింది. జనవరి 17న జరగనున్న శ్రీ మందిరం ప్రాకార ప్రాజెక్టు లోకార్పణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలం నుంచి ప్రజలు పూరీకి తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- అమొ ఒడిశా నవీన్ ఒడిశా కార్యక్రమాన్ని 6 వేల 794 పంచాయతీలలో అమలు చేయనున్నారు. ముందుగా పంచాయతీలో సమావేశాలు నిర్వహిస్తారు. అధికారులు, ప్రజల సమక్షంలో ప్రగతి పథకాల వీడియోలు ప్రదర్శిస్తారు. మండలంలో మంచి పనులు చేసిన వారికి బహుమతులు ప్రదానం చేస్తారు. పంచాయతీ సమగ్ర అభివృద్ధిపై సినిమా చిత్రీకరిస్తారు. ఇందుకు ఒక్కో పంచాయతీకి రూ.3 లక్షలు కేటాయిస్తారు.

ఘనంగా ఆంధ్ర మహిళా సమాజం 117వ వార్షికోత్సవం



నగర మేయర్ సంఘమిత్ర దొలాయిని సన్మానిస్తున్న నిర్వాహకులు



ఉత్సవాల్లో పాల్గొన్న తెలుగు మహిళలు

బరంపురం: స్థానిక ప్రకాశం నూతన భవనంలో ఆంధ్ర మహిళా సమాజం 117వ వార్షికోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మహిళా సమాజం అధ్యక్షురాలు మోనింగి కామేశ్వరి అధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో నగర మేయర్ సంఘమిత్ర దొలాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూడిపెద్ది సత్యనారాయణబాబు ఆంధ్ర మహిళా సమాజం చరిత్రను వివరించారు. అనంతరం మేయర్‌ను సన్మానించారు. భరత నాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

9న పాండ్యన్ పర్యటన



మాట్లాడుతున్న నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి

కొరాపుట్: నియోజకవర్గంలో ఈ నెల 9న 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ పర్యటన ఉంటుందని నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి ప్రకటించారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ నియోజకవర్గం రాయిఘర్ సమితి కేంద్రంలో పాండ్యన్ పర్యటనకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉమ్మర్‌కోట్ విధాన సభ స్థానం గెలుపే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. 35 వేల మంది కార్యకర్తలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పార్టీ జిల్లా పరిశీలకుడు, కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, ఉమ్మర్ కోట్ మాజీ ఎమ్మెల్యే సుభాష్ గొండో మాట్లాడుతూ అదే రోజు పాండ్యన్ మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ నియోజకవర్గాల్లోనూ కార్యకర్తలతో సమావేశమవుతారని చెప్పారు. పాండ్యన్ ప్రస్తుతం పార్టీ బలహీనంగా ఉన్న స్థానాల్లో పర్యటిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మర్‌కోట్, మల్కన్‌గిరి స్థానాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు. లక్ష్మీపూర్ నియోజకవర్గంలో పార్టీ బలహీనంగా ఉందని నిఘా సంస్థలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలోపాండ్యన్ పర్యటిస్తున్నారు.

మహంత మంగళాబాబా మృతికి సంతాపం



సంతాపం తెలియజేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

పర్లాకిమిడి: రాయఘడ బ్లాక్ కుజాసింగి గ్రామానికి చెందిన ప్రముఖ సాధువు, విశ్వహిందూ పరిషద్ సభ్యుడు మహంత మంగళా బాబా తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహానికి కెరండీ గ్రామంలో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. సంతాపసూచకంగా పర్లాకిమిడి గజపతి ప్యాలస్ వద్ద ఆయన చిత్రపటానికి వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు కైలాష్ చంద్ర గొడో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు లోకనాథ మిశ్రా, కై లాష్ పట్నాయక్, గౌతం పాడి, సత్యనారాయణ కార్జి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల విలువైన కలప పట్టివేత



పట్టుబడిన కలపను అటవీ కార్యాలయానికి తరలిస్తున్న సిబ్బంది

జయపురం: బొయిపరిగుడ సమితి పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి ఆదివారం తెల్లవారుజామున తరలిపోతున్న కలప దుంగలను ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. మొసిగాం అటవీ ప్రాంతంలో పట్టుబడిన ఈ కలప విలువ రూ.10 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ దాడుల్లో జయపురం అటవీ డివిజన్ అధికారి ప్రతాప్ కుమార్ బెహరా, ఏసీ ఎఫ్.సుభాష్‌కుమార్ ఖుంటియా, అజిత్ బిశాయి, జయపురం అటవీరేంజ్ అధికారి సచితానంద పారిడ, బొయిపరిగుడ అటవీ రేంజ్ అధికారి సందీప్‌కుమార్ పాణిగ్రహితో పాటు ఏడుగురు బొయిపరిగుడ పోలీసులు పాల్గొన్నారు.

సోన్‌పూర్–ఖంబేశ్వరపల్లి రైల్వే లైన్ ప్రారంభం



రైల్వే లైనును పర్యవేక్షిస్తున్న అధికారులు

భువనేశ్వర్: రాష్ట్రంలో సోన్‌పూర్, ఖంబేశ్వరపల్లి మధ్య బ్రాడ్‌గేజ్ రైలు మార్గం పనులు పూర్తి కావడంతో ప్రారంభించారు. రైల్వే భద్రతా కమిషనర్ (సీఆర్ఎస్) 10.5 కి.మీ.కొత్తగా ఏర్పాటు చేసిన రైలు పట్టాల స్థితిగతులు, ఇతర అనుబంధ భద్రత వ్యవస్థను పరిశీలించారు. అంతా సవ్యంగా ఉండటంతో రైళ్ల రాకపోకలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. సీఆర్ఎస్ ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ, వంతెనల భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజరు, ఇతర సీనియర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 301 కిలోమీటర్ల ఖుర్దా రోడ్ – బొలంగీర్ రైలు ప్రధాన ప్రాజెక్టులో సోన్‌పూర్ – ఖంబేశ్వరపల్లి రైలు లైను ఓ భాగం. ప్రధాన ప్రాజెక్టులో 152.8 కిలోమీటర్ల రైలు మార్గం ఇప్పటికే ప్రారంభమైంది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ ఖుర్దారోడ్, బొలంగీరు రెండు వైపుల నుంచి రైలు మార్గం నిర్మాణం పనులు కొనసాగిస్తున్నారు. బొలంగీర్ నుంచి జర్తర్భా వరకు ఉన్న లైన్‌లోని రెండు విభాగాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గతంలో ప్రజలకు అంకితం చేశారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ ప్రాజెక్ట్ పురోగతిని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఖుర్దా రోడ్ బలంగీర్ రైల్ లైన్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడానికి రైల్వే శాఖ ప్రాధాన్యమిస్తోంది. తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ ప్రస్తుతం జరుగుతున్న పనుల స్థితిగతులను సమీక్షిస్తూ గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



పర్లాకిమిడిలో కేక్ షాపు వద్ద సందడి

కేకులకు గిరాకీ

పర్లాకిమిడి: కొత్త సంవత్సరం నేపథ్యంలో పర్లాకిమిడి మార్కెట్‌లో కేకులకు గిరాకీ ఏర్పడింది. మిఠాయి, బేకరీ షాపుల వద్ద ఖరీదైన చంద్రయాన్ కేకు, స్నోబాల్ కేకులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది అమ్మకాలు బాగున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. రూ.150 నుంచి రూ.2 వేల వరకు కేకులు అమ్ముడుపోతున్నాయి.

ఐదు వాహనాలు.. ఐదుగురు బాధితులు

- ఖైందుగుడ ప్రాంతంలో రోడ్డు ప్రమాదం
- ఐదుగురికి తీవ్ర గాయాలు



వాహనంలో చిక్కుకున్న కారు డ్రైవర్



ప్రమాదానికి గురైన వాహనాలను తొలగిస్తున్న దృశ్యం

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొరిగుమ్మ సమితిలో 26వ జాతీయ రహదారిపై ఖైందుగుడ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే ప్రదేశంలో ఐదు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రెండు బొలెరోలు, రెండు కార్లు, ఒక బైక్ ప్రమాదానికి గురయ్యాయి. కారు డ్రైవర్ వాహనంలోనే చిక్కుకోవడంతో బొరిగుమ్మ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అతి కష్టమ్మీద బయటకు తీశారు. అతడితో పాటు గాయపడిన మరో నలుగురిని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్యకళాశాల హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం కారణంగా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన వాహనాలను బుల్‌డోజర్ తీసుకొచ్చి తొలగించారు. తీవ్రంగా గాయపడిన వారిలో ముగ్గురు నవరంగపూర్ జిల్లాకు చెందిన వారు కాగా, మరోవ్యక్తి సెమిలిగుడ వాసి అని, ఇంకో వ్యక్తి ఝిలిమిలి ప్రాంతానికి చెందిన వాడని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బొరిగుమ్మ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు



ప్రమాదానికి గురైన బైక్



నుజ్జుగా మారిన బొలెరో, కారు



క్షతగాత్రులను అంబులెన్స్ ఎక్కిస్తున్న స్థానికులు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



రోదిస్తున్న బాధిత కుటుంబం

కొరాపుట్: రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ నియోజకవర్గం రాయిఘర్ సమితి దేవఘర్ గ్రామంలో చోటుచేసుకుంది. గౌరవ్ అనే నాలుగేళ్ల బాలుడు తన తండ్రి రాజ్‌కుమర్‌తో కలిసి రోడ్డుపై వెళ్తున్నాడు. ఒక్కసారిగా తండ్రి చేతిని వదిలి రోడ్డుకు అడ్డంగా పరుగెత్తాడు. అదే సమయంలో రాయిఘర్–కుందేయి దారిలో లారీ వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే బాలుడు మృతిచెందాడు. దీంతో గ్రామస్తులు ఆగ్రహించి రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న అధికారులు పరిహారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

ఐకమత్యంతో సేవా కార్యక్రమాలు

- శిష్టకరణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీజీ ఈశ్వరరావు, తదితరులు

విజయనగరం టౌన్: శిష్టకరణ సంఘ సభ్యులందరూ ఐకమత్యంతో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక బృందావనం అపార్ట్‌మెంట్‌లో కులస్తుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో ఓబీసీ సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల నిర్వహించిన వివాహ పరిచయ వేదిక పుస్తకం, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బగ్గం సుధాకర్ పట్నాయక్, జిల్లా కోశాధికారి వంద్రాంగి వెంకటేష్, ఉపాధ్యక్షులు ఎల్.ప్రభాత్‌కుమార్, ఏటీ.వరప్రసాద్, జోగారావు, పరమేశ్వరరావు, గోవింద సుధాకర్, కె.సంగీత, పట్టణ అధ్యక్షుడు సంజీవరావు, త్యాడ ప్రసాద్, బలివాడ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


ఎమ్మెల్యేను బడ్డుకొండ అప్పలనాయుడును సత్కరిస్తున్న హరీష్, కృష్ణారావు

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నగర పంచాయతీ యువజన అధ్యక్షుడిగా నియమితులైన కారుకొండ హరీష్ ఆధ్వర్యంలో 100 మంది యువజన కార్యకర్తలతో కలిసి నెల్లిమర్లలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డెంకాడ మండలంలోని మోపాడలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ కారుకొండ వెంకటకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు


తలుపుల్లేని మరుగుదొడ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం వసతిగృహంలో మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ వసతిగృహంలో సుమారు 100 మందికి పైగానే విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో ఆరు బయటకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ముగిసిన మహాసప్తాహం


ఆధ్యాత్మిక విషయాలు చెబుతున్న శ్రీనివాసానంద సరస్వతి

సంతకవిటి: మండల కేంద్రంలోని ఆంజనేయ గుడి ఆవరణలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మహాసప్తాహం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీనివాసానంద సరస్వతి, కంచుమోజు రామ్మోహనరావు, యాలాల శ్రీనివాసరావులు ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

భగవన్నామస్మరణతోనే మోక్షం


మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్తలు

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని ఆధ్యాత్మిక వక్తలు జడ్డు జగ్గారావు, రామశేషు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దత్త పీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన జ్ఞానబోధ సభకు హాజరైన వారు ప్రతిరోజూ భగవంతుడిని స్తుతించాలన్నారు. దేవుడిని నమ్ముకోవడం, పూజలు చేయడం ద్వారా సకల పాపహరణం జరిగి, సుఖసంతోషాలు కలుగుతాయన్నారు. మనిషిని తరింపజేసేది తారకమంత్రమని, ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో భగవంతుడి నామం జపిస్తే ముక్తిని పొందుతారన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టార్, పండిత నాగేశ్వరరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

పట్టాలెక్కిన అమృత్ భారత్

- మాల్దా టౌన్ నుంచి బెంగళూరు వరకు పయనం
- ప్రారంభోత్సవానికి హాజరైన నాయకులు, అధికారులు


భువనేశ్వర్: ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఈస్టుకోస్టు జనరల్ మేనేజర్, ఖుర్దారోడ్ డీఆర్‌ఎం, ప్రజాప్రతినిధులు



భువనేశ్వర్: ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్లో పూలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

భువనేశ్వర్: రైలు ప్రయాణికులకు అధునాతన రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మాల్దా టౌన్ నుంచి భువనేశ్వర్, విశాఖపట్నం మీదుగా బెంగళూరుకు 13434 / 1343 అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్గా ఈ రైలు సేవలు ప్రారంభించారు. ఆగ్నేయ రైల్వే, తూర్పు కోస్తా రైల్వే పరిధిలో జలేశ్వర్, బాలేశ్వర్, సారో, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్, బరంపురం స్టేషన్లలో ఈ రైలుకు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా రైల్వే ప్లాట్ ఫాం ప్రాంగణాలు బాజాభజంత్రీలతో మారుమోగాయి. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలలకు ప్రత్యేకం..

కొత్తగా పట్టాలు ఎక్కిన అమృత్‌భారత్ ఎక్స్ ప్రెస్ రైలులో తొలి రోజున బాలలకు ఉచిత ప్రయాణం అవకాశం కల్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు భువనేశ్వర్, ఖుర్దా రోడ్ నుంచి శ్రీకాకుళం రోడ్ వరకు ఉచితంగా ప్రయాణించారు.

రైలు హాల్టులివే..

- 13434 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతి ఆదివారం ఉదయం 8.50 గంటలకు మాల్దా టౌన్ స్టేషన్ నుంచి బయల్దేరి మంగళవారం వేకువజాము 3 గంటలకు బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 1343 అమృత్ భారత్ ఎక్స్ రైలు బెంగళూరు నుంచి ప్రతి మంగళవారం మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 11 గంటలకు మాల్దా టౌన్ చేరుతుంది.
- న్యూఫరక్కా, రాంపూర్ హట్, బోల్ పూర్, బర్ధమాన్, డంకుణి, అందుల్, ఖరగపూర్, బేల్దా, జలేశ్వర్, బాలేశ్వర్, సారో, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్, బరంపురం, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, విశాఖపట్నం, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్ పెట్టై స్టేషన్లలో ఆగుతుంది.
- సాధారణ ఎక్స్ ప్రెస్ రైలు చార్జీల కంటే అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలు చార్జీలు స్వల్పంగా అధికం. భువనేశ్వర్ నుంచి



బరంపురం: స్టేషన్‌కు చేరుకున్న వందే భారత్ రైలు

చార్జీల వ్యత్యాసం..

సాధారణ ఎక్స్ ప్రెస్ రైలులో సాధారణ శ్రేణి చార్జీ రూ. 365 కాగా అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలులో రూ. 420 చెల్లించాల్సి ఉంటుంది. స్లీపర్ శ్రేణిలో సాధారణ ఎక్స్ ప్రెస్ చార్జీ రూ. 625 కాగా అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలులో చార్జీ రూ.715గా నిర్ణయించారు. అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలులో 12 స్లీపర్, 8 సాధారణ శ్రేణి బోగీలు ఉంటాయి. వీటిలో 1,834 మంది ప్రయాణించవచ్చు. అధునాతన సౌకర్యాలు కలిగిన అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలు గంటకు సగటున 130 కిలో మీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.


బరంపురం: స్వాగతం పలుకుతున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎంఎల్ఏ విక్రమ్ పండా తదితరులు

బరంపురంలో ఘన స్వాగతం..

బరంపురం: తొలిసారిగా బరంపురం రైల్వేస్టేషన్‌కు వచ్చిన వందేభారత్ రైలు ఉదయం 11 గంటలకు చేరుకుంది. ప్రారంభోత్సవానికి బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా ముఖ్య అతిథులుగా చేరుకుని స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి రైలు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కన్నుపతి, సుభాష్ సాహు, సునిల్ సాహు, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


ఏఎన్‌ఎం కళాకారులకు జ్ఞాపికలు అందజేసిన నిర్వాహకులు, అధికారులు


కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీడీఎంఓ డాక్టర్ పాత్రో

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నువా ఒడిశా.. నవీన్ ఒడిశాలో భాగంలో వివిధ క్రీడా, సోషల్, స్టార్ట్ అప్ కామెడీ పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రభుత్వ మహిళా హెల్త్‌వర్కర్లు శిక్షణార్థులకు ఆదివారం బెత్తగుడ వద్ద బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువ ఒడిశా..నవీన్ ఒడిశా కార్యక్రమంలో రాష్ట్రంలో సత్ఫలితాలిస్తోందని చెప్పారు. అనంతరం ఏఎన్‌ఎంలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సీడీఎంఓ డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో, ఏఎన్‌ఎం ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ మధుమతి మరియు, జిల్లా క్రీడా శాఖాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి, డీపీఎం సౌమ్యారాణి గౌడో, ఆరోగ్యశాఖ సిబ్బంది జగదీష్ పట్నాయక్, మమతా పాఢి తదితరులు పాల్గొన్నారు.


మమతాపాఢికి పురస్కారం అందజేస్తున్న కలెక్టర్

వాడీవేడిగా సమితి సమావేశం


సమావేశంలో పాల్గొన్న సమితి సభ్యులు

జయపురం: సబ్ డివిజన్‌లోని బొయిపరిగుడ సమితి సమావేశం వాడీవేడిగా సాగింది. ముఖ్యంగా సమితి పరిధిలో పాఠశాలలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమితి అధ్యక్షుడు ప్రశాంత కుమార్ గుప్తా అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ రామగిరి, చికాపూర్, దండాబడి గ్రామ పంచాయతీలలో ఉపాధ్యాయులు మధ్యాహ్నం 12 గంటలకు పాఠశాలలకు వచ్చి 3 గంటలకే మూసి వెళ్లిపోతున్నారని చెప్పారు. దీంతో పిల్లల చదువులు సక్రమంగా సాగడం లేదని మండిపడ్డారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

యంత్రాల వాడకంతో అధిక దిగుబడులు


యంత్రమేళా ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

జయపురం: వ్యవసాయంలో యంత్రాల వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలక అన్నారు. జయపురం దసరా పాడియ మైదానంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ వ్యవసాయ యంత్ర పరికరాల మేళా శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి సీఎం నవీన్ పట్నాయక్ కృత నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. సబ్సిడీపై యంత్రాలు అందజేసేందుకు మేళాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొరాపుట్ జిల్లా వ్యవసాయాధికారి ప్రదీప్‌కుమార్ మహంతి మాట్లాడుతూ మేళాలో భాగంగా రూ.18 కోట్ల 50 లక్షల విలువైన యంత్రాలకు రైతులు ఆర్డర్లు ఇచ్చారని వెల్లడించారు. అనంతరం 13 మంది ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో జయపురం ఆర్‌ఎంసీ వైస్ చైర్మన్ బాలా రాయ్, మల్కనగిరి జిల్లా ప్రధాన వ్యవసాయ విభాగాధికారి జె.సూర్యారావు, వ్యవసాయ విశ్వవిద్యాలయ విశ్రాంత డీన్ డాక్టర్ చింతామణి పండా తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న సైకత శిల్పం

భారీగా గంజాయి స్వాధీనం



బరంపురం: స్వాధీనం చేసుకున్న గంజాయితో అబ్కారీ అధికారులు


మల్కన్‌గిరి: బలిమెల పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

బరంపురం: గంజాయి అక్రమ రవాణాను అధికారులు అడ్డుకున్నారు. బరంపురం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ సత్తపతి తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం మోన పోలీసుస్టేషన్ పరిధిలోని గుముసర అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరం మీదుగా కోల్‌కతాకు కారులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అబ్కారీ అధికారులు ఫస్ట్‌గేట్ జంక్షన్ వద్ద తనిఖీలు జరిపారు. అందులో 25 ప్యాకెట్లలో 50 కిలోల గంజాయి గుర్తించారు. కారును స్వాధీనం చేసుకుని మోహన బ్లాక్కు చెందిన మున్నా నాయక్‌ను అరెస్టు చేశారు. అదే విధంగా, దిగపండి పోలీసుస్టేషన్ పరిధి బల్లిపడా జంక్షన్‌లో తనిఖీలో చేయగా కారులో 50 కేజీల గంజాయి సీజ్ చేశారు. కల్లు పరిడా, సన్యాసి గౌడాలను అరెస్టు చేశారు.

- **మల్కన్‌గిరి:** జిల్లాలోని బలిమెల పోలీసులు శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించి మూడు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కుడుమూలగూమ్మ ఔట్‌పోస్టు పరిధిలో పర్కన్‌పల్లి పంచాయతీ సునానగార్ అటవీ ప్రాంతం నుంచి గంజాయి రవాణా అవుతోందన్న సమాచారం మేరకు బలిమెల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల రాకతో నిందితులు పరారయ్యారు. 12 బస్తాల్లో మూడు క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మంగమ్మ, గ్రామ పెద్దలు

నెల్లిమర్ల రూరల్: ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పూతికపేట సర్పంచ్ లెంక మంగమ్మ, వైఎస్సార్‌సీపీ నేత గోవింద అన్నారు. గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు సహకారంతో గ్రామంలో సిమెంట్ రహదారులు, డ్రైన్లు నిర్మించామన్నారు. గ్రామస్తుల ఆకాంక్ష మేరకు త్వరలోనే కమ్యూనిటీ భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టూరిస్ట్ బస్సు బోల్తా


బోల్తాపడిన బస్సు వద్ద సహాయక చర్యలు

బరంపురం : గంజాం జిల్లా పులసర బ్లాక్‌లో ఆదివారం బుద్ధకుల పిక్నిక్ స్పాట్‌కు బయలుదేరిన టూరిస్ట్ బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 25 పర్యాటకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పులసరా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పులసర నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరిన బస్సు బలియా గ్రామం వద్ద దట్టంగా మంచు కురవడంతో దారి కనిపించక పక్కనే ఉన్న గట్టును ఢీకొట్టి బోల్తాపడింది. గాయపడిన వారిని అంబులెన్సులో పులసరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.


మొక్కలు నాటుతున్న మందిర సురక్షా సమితి కార్యకర్తలు

పరిసరాల శుభ్రతకు శ్రీకారం

జయపురం:

పట్టణంలో పలు మందిరాలు శిథిలావస్థకు చేరి పరిసరాలు అధ్వానంగా మారాయి. ఈ నేపథ్యంలో జయపురం మందిర సురక్షా సమితి సభ్యులు శుభ్రతా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం కుంభారి సాహిలోని బాలాజీమఠం వద్ద చెత్తాచెదారాలు తొలగించి మొక్కలు నాటారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

● డీఐజీ హరికృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న డీఐజీ హరికృష్ణ

కొమరాడ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు డీఐజీ ఎస్.హరికృష్ణ అన్నారు. కొమరాడ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. స్టేషన్‌లో పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నక్సల్స్ ప్రభావం లేదని, గిరిశిఖర గ్రామాల్లో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా చేపట్టిందన్నారు. రహదారి సౌకర్యంతో పాటు గిరి శిఖరాల్లో సెల్ టవర్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, మద్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఏఓబీ సరిహద్దు గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ ఉందన్నారు. ఆయన వెంట మన్యం ఎస్పీ విక్రాంత్‌పాటిల్, డీఎస్పీ మురళీధరన్, పార్వతీపురం సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ నీలకంఠేశ్వరరావు ఉన్నారు.

సాలూరులో..

సాలూరు: సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్, సర్కిల్ ఆఫీస్‌ను డీఐజీ హరికృష్ణ ఆదివారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏఎస్పీ సునీల్ షరన్ ఉన్నారు.

ప్రజల జీవితాల్లో కొత్త వత్సరం వెలుగులు నింపాలి

● మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం అర్బన్: కొత్త సంవత్సరంలో జిల్లా లోని ప్రతి కుటుంబం ఆర్థి కంగా, సామాజికంగా అభివృద్ధి చెంది జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆకాంక్షించారు. జిల్లా ప్రజల కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, 2023లో జిల్లా అభివృద్ధిలో మైలురాయి అనదగిన ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. 2024 జిల్లా అభివృద్ధికి మరింత ఆశాజనకంగా వుంటుందని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు జిల్లా కేంద్రంలోనే మంత్రి బొత్స

నూతన సంవత్సరం రోజున రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా కేంద్రంలోనే సందర్శకులకు అందుబాటులో ఉండనున్నారు. సోమవారం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి తనను కలిసేందుకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికార, అనధికారులను తన నివాసలో కలుస్తారు.

సంక్షేమం, అభివృద్ధితో ప్రగతి పథంలో జిల్లా

● కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో వివిధ వర్గాల వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాలు, కార్యక్రమాలతో 2023 సంవత్సరంలో గణనీయమైన పురోగతి సాధించామని, 2024లో కూడా ఈ అభివృద్ధి పథాన్ని కొనసాగిస్తూ మరింత పురోగతి సాధిస్తుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతూ తమ జీవన ప్రమాణా లు మెరుగుపరచుకోవడం ద్వారా కొత్త ఏడాది వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరు కుంటున్నట్టు నూతన సంవత్సర సందేశంలో పేర్కొన్నారు.

ప్రజల ఆత్మగౌరవానికి - పెత్తందారీ వ్యవస్థకు మధ్య పోటీ

● రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆత్మస్థైర్యం నింపుకున్న ప్రజల ఆత్మగౌరవానికి కల్లబొల్లి కబుర్లతో మభ్యపెట్టే పెత్తందారీ వ్యవస్థకూ మధ్య ఎన్నికల యుద్ధం త్వరలోనే జరగనుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు స్వగ్రామమైన మండలంలోని పక్కిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని 94 సచివాలయాల్లో పూర్తి చేసిన సందర్భంగా ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి బొత్స సత్యనారాయణ మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతీ వర్గానికీ సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఆ తరువాత ప్రజల దగ్గరకు వెళ్లి ఏమేం పనులు కావాలో అడగమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారన్నారు. ఆ విధంగానే ప్రతీ ఇంటికీ శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితర ఎమ్మెల్యేలంతా వెళ్లి ముఖ్యమంత్రికి అవసరాల నివేదిక ఇచ్చామన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఎంపీగా, మంత్రిగా పని చేసినా ఇటువంటి ప్రభుత్వా న్ని చూడలేదన్నారు. కేవలం బొబ్బిలి నియోజకవర్గానికే వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి రూ.1075 కోట్లు జమ చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాని కి చెందుతుందన్నారు. ఇదే బడ్జెట్‌తో గత ప్రభుత్వాలు ఎందు కు చేయలేకపోయాయని ప్రశ్నించారు. ఆసరా నిధులతో మహిళ లు తమ పిల్లల అవసరాలను తీర్చుకునే అవకాశాలు కల్పించిందన్నారు. పసుపు కుంకుమ పేరుతో మోసగించబడ్డ డ్వాక్రా మహిళలకు రుణమాఫీని చేస్తూ నాలుగో విడతను త్వరలోనే జమ చేస్తున్నామన్నారు.

ప్రత్యేక శ్రద్ధ

- శారీరక, మానసిక లోపం కలిగిన పిల్లలకు విద్యాబుద్ధులు
- జిల్లాలో 400 మందికి పరికరాలతో శిక్షణ
- మనోధైర్యం అందిస్తున్న భవిత కేంద్రాలు



పూసపాటిరేగ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు

పూసపాటిరేగ: శారీరక, మానసిక లోపాలతో బాధపడుతున్న ప్రత్యేకావసరాలు గల పిల్లలు జీవితాల్లో భవిత కేంద్రాలు వెలుగు నింపుతున్నాయి. ఫిజియోథెరపీ, వ్యాయామం, ప్రత్యేక పరికరాలతో వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాయి. విజయనగరం జిల్లా వ్యాప్తంగా భవిత కేంద్రాల్లో సుమారు 400 మంది వరకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్నారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు పిల్లల మానసిక పరిస్థితిని గుర్తించి వారిలో మార్పు తీసుకువస్తున్నారు. చిన్నారులకు కావాల్సిన పరికరాలను ప్రభుత్వం అందిస్తోంది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నెల్లిమర్లలో 20 మంది, డెంకాడ 16, పూసపాటిరేగ 12, బోగాపురం14 మంది ఉన్నారు. మానసిక వైకల్యం, వినికిడిలోపం , సెరిబ్రల్‌పాల్సి, బహుళవైకల్యం, వంటి 21 అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ప్రాథమిక విద్యతో పాటు ఫిజియోథెరపీ డాక్టర్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. ప్రతినెలా పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మానసిక సంఘర్షణ కలిగిన పిల్లలతో ప్రవర్తించాలిన్న తీరుపై కౌన్సెలింగ్ చేస్తున్నారు. అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ, సాధారణ స్థితికి రావాల్సిన ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తున్నారు. బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలకు వారి అవసరాలను ఎలా గుర్తించాలనే దానిపై తెలియజేస్తారు. మానసికస్థితి నుంచి బయటపడిన పిల్లలను వారి వయసుకు తగ్గట్లు ఆయా పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్

ప్రత్యేక శిక్షణ కోసం భవిత కేంద్రానికి వచ్చే పిల్లలకు ప్రభుత్వం నెలకు రూ.300 చొప్పున 10 నెలలకు రూ.3 వేలు అందజేస్తోంది.

ఎస్కార్ట్ అలవెన్స్

1 వతరగతి నుంచి 12 వతరగతి వరకు పాఠశాల లేదా కళాశాలకు నడిచిరాని పిల్లలకు తల్లిదండ్రులు సహాయంతో బడికి వెళ్లడానికి నెలకు రూ.300 చొప్పున 10 నెలలకు రూ.3 వేలు అందిస్తున్నారు.

స్టైపెండ్

6 వతరగతి నుంచి 12 వతరగతి వరకు చదివే విభిన్న ప్రతిబావంతులైన బాలికలకు నెలకు రూ.200 చొప్పున 10 నెలలకు రూ.2 వేలు అందిస్తునారు.

హాస్టల్ అలవెన్స్

6 వరతగతి నుంచి 12 వతరగతి వరకు హాస్టల్‌లో చదివిన పిల్లలకు నెలకు రూ.200 చొప్పున రూ.2 వేలు ఇస్తారు శారీరక మానసిక వైకల్యం కలిగిన పిల్లలకు ప్రభుత్వం అవసరమైన పరికరాలను ఉచితంగా అందిస్తుంది.

ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి



విభిన్న ప్రతిభావంతులకు భవిత కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. వివిధ రకాల సమస్యలతో వస్తున్న పిల్ల లకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నాం. ఫిజియోథెరపీ, మసాజ్ వంటివి చేయించి పిల్లలను సాధారణ స్థితిలోకి వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

హిమబిందు,
ఫిజియోథెరపీ వైద్యురాలు, పూసపాటిరేగ

సామాన్యులకు అందుబాటులో అమృత్‌భారత్ రైలు



అమృత్ భారత్ రైలువద్ద స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

● ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విజయనగరం టౌన్: అమృత్‌భారత్ రైలు సామాన్యులకు అందుబాటులోకి రావడం ఎంతో ఆనందదాయకమని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లోని మాల్డా సిటీ నుంచి ప్రారంభమైన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం మధ్యాహ్నం విజయనగరం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ఆర్థిక, సామాజిక, వ్యాపార, రవాణా రంగాల్లో దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలనే ఆలోచనలో భాగమే అమృత్ భారత్ ట్రైన్ అని తెలిపారు. బీజేపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఈశ్వరరావు మాట్లాడుతూ నాన్ ఏసీ ఎక్స్‌ప్రెస్ రైలులో పేదలు, మధ్యతరగతి ప్రజలు అతి తక్కువ చార్జీలతో ప్రయాణం చేయడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ రైలు నడుస్తుందన్నారు. ఈ రైల్లో మొత్తం 22 బోగీలు ఉంటాయని, అందులో 8 బోగీలు పూర్తిగా జనరల్ బోగీలని, 12 బోగీలు రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్లని మిగిలిన 2 బోగీలు ఇంజిన్‌లని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని మాట్లాడుతూ సామాన్య ప్రజలు కోరుకునేది రైలు ప్రయాణమన్నారు. బస్సుల్లోనూ, మరో విధంగా ప్రయాణం చేయాలంటే అత్యంత ఖర్చుతో కూడుకుంటుందన్నారు. సామాన్యుడు కూడా ప్రయాణించే విధంగా అమృత్ భారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టడం ఆయన ఇచ్చిన కానుకగా భావించాలన్నారు. అనంతరం జిల్లాకు చేరుకున్న అమృత్ భారత్ రైలుకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. చిన్నారుల సాంస్కృతిక నృత్యప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు, కన్‌స్ట్రక్షన్ సీఈ కెడి.రావు, స్టేషన్ మేనేజర్ మురళీకృష్ణ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, బీజేపీ నాయకులు కుసుమంచి సుబ్బారావు, బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, ఇమంది సుధీర్, బొబ్బిలి శ్రీను, రాజేష్ వర్మ, పిల్లా నవీన్ రైల్వేఅధికారులు, బీజేపీ జిల్లా నాయకులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

విజయనగరం అర్బన్: రాష్ట్రప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని గుర్తించి ఉపాధ్యాయులు సహకరించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్, డైరీలను ఆదివారం ఆయన తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ స్కూళ్లలో చేరే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగా చేపడుతున్న సంస్కరణలను స్వాగతించాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో సంఘం సీనియర్ నేతలు ఎ.సదాశివరావు, డి.ఈశ్వరరావు, సీహెచ్.వెంకటరమణ, ఆర్.కృష్ణ, ఎస్‌వీపైడిరాజు, ఏవీ శ్రీనివాసరావు, సీహెచ్.రామారావు, ఎన్.శ్రీదేవి, దామోదర నాయుడు, మధుసూదనరావు తదితరులు ఉన్నారు.

పది సమస్యల పరిష్కారం

● అంగన్‌వాడీల సమ్మెపై మంత్రి బొత్స



మాట్లాడుతున్న మంత్రి బొత్స

బొబ్బిలి: రాష్ట్రంలోని అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని 11 అంశాలను ప్రభుత్వం ముందు పెడితే అందులో పదింటిని పరిష్కరించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్క అంశమైన వేతనాల పెంపును ఇదివరకే చేశాం. అది సరిపోతుందని కూడా అనలేదు. సమయం చూసుకుని ఎన్నికలయ్యాక తప్పకుండా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ కన్నా ఎక్కువ వేతనం ఇస్తామని చెప్పినట్లే చేశాం. అంతేకానీ వారు పెంచుతామన్నప్పుడల్లా పెంచుతామనలేదు. వారి డిమాండ్ మేం కాదనలేదు. తప్పనిసరిగా పెంచుతాం. కొంచెం సమయం ఇవ్వాలని మాత్రమే అడిగాం. చిన్నారులు, గర్భిణుల సమస్యలను చూసి సమ్మె విరమించాలని చెప్పాం. వైఎస్సార్ కిట్లు ఇవ్వాలి కనుక ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటోంది. దయచేసి అపార్థం చేసుకోకుండా అంగన్‌వాడీలు సమ్మె విరమించి ప్రభుత్వానికి సహకరించాలని హృదయపూర్వకంగా కోరుతున్నామన్నారు.

జగన్‌తోనే అన్ని వర్గాలకు మేలు

● ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు అని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆదివారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు తొలుత ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేసిందని గుర్తు చేశారు. గతంలో టీడీపీ చేయలేమని చేతులెత్తేసిన సంక్షేమాన్ని ప్రజలు ముందుకు తీసుకువచ్చిందన్నారు. అన్ని వర్గాల్లోని ప్రజలకు లబ్ధి జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేయడం జరుగుతోందన్నారు. అన్ని ప్రాంతాలతో పాటు అన్ని వర్గాల వారు అభివృద్ధి సాధించాలన్నదే సీఎం జగనన్న ధ్యేయమని, అదే దిశగా ఆయన పాలన కొనసాగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే పార్టీని ఆదరించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కొబగాన ముత్యాలమ్మ, ఎంపీటీసీ కింజరాపు సురేష్‌కుమార్, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొలివి జగ్గునాయుడు, సంకిలి పీఏసీఎస్ అధ్యక్షుడు లావేటి వేణుగోపాలనాయుడు, సర్పంచ్‌లు పాడి లక్ష్మునాయుడు, గార రమణ, కరణం గోవిందరావు, కరణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలకు చిక్కిన అరుదైన రొయ్యలు



ముక్కాంలో వలకు చిక్కిన రొయ్యలు

భోగాపురం: మండలంలోని ముక్కాం సముద్ర తీరంలో అరుదైన రొయ్యలు మత్స్యకారుల వలకు చిక్కాయి. ఆదివారం సముద్రంలో వేటకు వెళ్లిన వాసుపల్లి ఎర్రయ్య వలకు ఈ రొయ్యలు చిక్కడంతో ఆయన సంతోష వ్యక్తం చేశాడు. వాటిని ఆర్ రొయ్యలని పిలుస్తారని మత్స్యకారులు చెబుతున్నారు.

● కోటి ఉషస్సుల కొత్త వత్సరం



కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో కోటి ఉషస్సులు నింపాలని ఆకాంక్షిస్తూ నగరంలోని బాబామెట్టలోని వరలక్ష్మీ నాట్యాలయ విద్యార్థినులు నూతన సంవత్సరానికి ఆదివారం అర్ధ రాత్రి ఇలా దీపవు వెలుగులతో స్వాగతం పలికారు. ప్రజలంతా నిత్య నూతనంగా సంతోష సంబరాలతో వెలుగొందాలని ఆకాంక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

2023...అభివృద్ధిలో చెరగని ముద్ర

- ఉమ్మడి విజయనగరం జిల్లా చరిత్రలో సువర్ణ అధ్యాయం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రత్యేక ప్రాధాన్యం
- శరవేగంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం
- సాకారమైన చిరకాల స్వప్నం విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల
- సాలూరు నియోజకవర్గంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం
- మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతైనా అవసరం
- 2024 సంవత్సరంలో ప్రజలదే కీలక నిర్ణయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: '2024 నూతన సంవత్సరంలో అడుగుపెట్టాం. గడిచిన 2023 సంవత్సరం ఉమ్మడి విజయనగరం జిల్లా చరిత్రలో చెరగని ముద్ర వేసింది. ఇదొ క సువర్ణాధ్యాయమనే చెప్పాలి. అభివృద్ధిలో వెనుకబడిన, వలసల జిల్లాగా ముద్ర పడిన ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో వరాలు అందించారు. ఆయన పాలనలో ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో అదే పంథా కొనసాగితే పేదరికమనే వలయం నుంచి విజయనగరం, పార్వతీపురం మ న్యం జిల్లాలు గట్టెక్కుతాయి. అందుకు మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావడం ఎంతైనా అవసరం. గతంలో కేంద్ర పదవులనూ చేపట్టినా ఈ ప్రాంత టీడీపీ నాయకులెవ్వరూ చేసింది శూన్యం. అందుకే 2024 సంవత్సరంలో రానున్న ఎన్నికల్లో ప్రజలదే కీలక నిర్ణయం. 2023 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2024 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుదాం. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వాధికారులకు శుభాకాంక్షలు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. విజయనగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మీడియాతో ఆదివారం మాట్లాడారు. విజయనగరం జిల్లాను అంతర్జాతీయ స్థాయి కి తీసుకెళ్లేలా ప్రపంచ పటంలో పెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కేంద్రం నుంచి అనుమతులన్నీ తీసుకొని, అడ్డంకులన్నీ పరిష్కరించిన తర్వాతే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన శంకుస్థాపన నిర్వహించడం 2023లో కీలక పరిణామమని చెప్పారు. అక్కడ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గతంలో అత్యవసర వైద్యానికి నోచుకోని ఈ ప్రాంత ప్రజల మద్దతుతోనే టీడీపీ నాయకులు కేంద్ర స్థాయి పదవులు అనుభవించినా జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లో రూ.500 కోట్లతో విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేసిన జగన్‌మోహన్‌రెడ్డే 2023 సంవత్సరంలో ప్రారంభించడమూ విశేషమన్నారు. గిరిజనులకు చేరువగా సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సాకారం చేస్తున్నారని చెప్పారు. అవసరమైన భూసేకరణ పూర్తి చేసి, మౌలిక వసతులన్నీ కల్పించి 2023లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. జంఝావతి, పెద్దగెడ్డ ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్రకే తలమానికమైన తోటపల్లి ప్రాజెక్టునూ పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరిగానే ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని చెప్పారు. అధికారం చేపట్టినప్పటి నుంచి విప్లవాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. 34 రకాల సంక్షేమ కార్యక్రమాలతో 2023 సంవత్సరంలో రూ.35వేల కోట్లకు పైగా ప్రజలకు నేరుగా అవినీతికి ఆస్కారం లేకుండా ప్రయోజనం చేకూరిందన్నారు. 2023లోనే కంటకాపల్లి వద్ద రైల్వే ప్రమాదం జరిగినప్పుడు వెనువెంటనే స్పందించారని, బాధిత కుటుంబాలకు తక్షణమే పరిహారం మంజూరు చేశారని చెప్పారు.

హామీలన్నీ శత శాతం అమలు

కొత్త సంవత్సరం 2024 ఎంతో కీలకమైందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. మూడే మూడు నెరవేర్చితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ శతశాతం పూర్తి అవుతాయని చెప్పారు. పింఛను రూ.3వేలకు పెంచి, లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని జనవరి 3వ తేదీన సీఎం ప్రారంభిస్తారని వెల్లడించారు. నాలుగో విడత వైఎస్సార్ ఆసరా జనవరి 23న, వైఎస్సార్ చేయూత ఫిబ్రవరి 5న నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా పరిషత్తు నుంచి 2023లో రూ.31 కోట్ల పైచిలుకు ప్రజా సంక్షేమానికి వినియోగించినట్టు చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, రహదారులు... ఇలా పలు విధాలా అభివృద్ధికి బాటలు వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో ఇద్దరికి పతకాలు



దినేష్



భార్గవి

నెల్లిమర్ల రూరల్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో డిసెంబర్ 28 నుంచి జరుగుతున్న ఐడబ్ల్యూఎల్‌ఎఫ్ జాతీయ స్థాయి యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని కొండవెలగాడ వెయిట్ లిఫ్టింగ్ జిమ్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటారు. 67 కేజీల విభాగంలో పోటీలో పాల్గొన్న దినేష్ స్నాచ్‌లో 108 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 108 కిలోలు... మొత్తంగా 132 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. మరో క్రీడాకారిణి బెల్లాన భార్గవి 40 కేజీల విభాగంలో వెండి పతకం దక్కించుకుంది. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.